క్లుప్తంగా

11 మందిపై బైండోవర్ కేసులు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని ఎస్ఐ రాము తెలిపారు. బుధవారం పెద్దఆముదాపాడులో 11మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ జుబేర్‌మొహీన్‌ద్దీన్ ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు.

రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదు

మల్దకల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి సరితను విమర్శించే స్థాయి పటేల్ ప్రభాకర్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవిందు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీలో ఉండి జిల్లా అధ్యక్షుడి పదవి చేపట్టిన పటేల్ ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి నాయకులను విమర్శించడం తగదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, మల్దకల్, రామకృష్ణ, అశోక్, రఘుపతి, జయనందం పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండపేటలో ఓ కిరాణం షాపులో అనుమతులు లేకుండా బెల్టు షాపు నడుపుతూ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. వారి నుంచి 12 లీటర్ల మద్యం (రూ.5,180 విలువ) అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



రాజోళి: మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద, గ్రామాల్లోని రోడ్డు మలుపుల దగ్గర సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా గ్రామాల్లో మలుపులు పూర్తిగా మూసుకుపోయి, ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలు పేర్కొన్నారు. గతంలో నిర్మించిన ఇళ్ల మధ్యలోనే ఇతర గ్రామాలకు వెళ్లే రోడ్లను వేయడం, వాటిలోనే నిత్యం వాహనాలు తిరుగుతుండటంతో, నిత్యం రహదారులన్నీ రద్దీగా మారుతున్నాయి. మలుపు ఉన్న చోట వాహనాలు వచ్చేటప్పుడు చాలా ఇబ్బందికరంగా ఇళ్ల మధ్యలో రహదారిపై పిల్లలకు, వృద్ధులకు ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. మలుపులు తొలగించకపోయినా, కనీసం సూచిక బోర్డులైనా ఏర్పాటు చేసి, ప్రమాదాలు తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షంలేక ఎండుతున్న పంటలు

ఉండవెల్లి: మండలంలోని గ్రామాల్లో వర్షం లేక పంటలు ఎండిపోతున్నాయి. ఆర్డీఎస్ నీరు లేక ఎండుముఖం పడుతున్నాయి. గ్రామాల్లో పంటలు ఎండుతుండడంతో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఉండవెల్లి శివారులో నీరు లేక మొక్కజొన్న పంట ఎండుముఖం పట్టింది. ఇప్పటికైనా ఆర్డీఎస్‌కు నీరు పారించాలని రైతులు కోరుతున్నారు.



నవదుర్గాదేవీ అలంకరణలో..



మల్దకల్‌లో లలితాదేవిగా..



ధరూరులో ధనలక్ష్మీదేవిగా..



ఉండవెల్లిలో లక్ష్మీదేవిగా..



బీచుపల్లిలో ధనలక్ష్మిగా..

దుర్గామాతకు నీరాజనం

గద్వాల: జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో దేవీ శరనవరాత్రులు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు నవదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

లలితాదేవిగా వాసవిమాత

మల్దకల్: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీదేవిగా అమ్మవారు

ధరూరు: మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు కలశ పూజ, కుంకుమార్చన, గణపతి పూజ నిర్వహించారు. సాయంత్రం పాల రఘు దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సరస్వతి అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాభిషేకాలు చేశారు. గాంధీనగర్‌లో లక్ష్మీదేవిగా, అనసూయమ్మ కాలనీలో అన్నదానం నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో కాళికాదేవి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, అంబా భవానీ ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

రాజోళి: శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని అంబా భవానీ మాత ఆలయంలో అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు లక్ష్మిపూజ నిర్వహించిన నాణేలను భక్తులకు అందజేశారు.

లలితాంబికాదేవిగా..

శాంతినగర్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శాంతినగర్‌లో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు నాలుగో రోజు లలితాంబికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సద్దుల బతుకమ్మ కార్యక్రమం చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేష్ కుమార్, అర్చకులు వినయ్‌కౌశిల్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గట్టు: మండల కేంద్రంలోని భవానీ మాత నాలుగో రోజు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఎస్ఎస్‌కే సమాజ్‌తో పాటుగా గట్టుకు చెందిన మహిళలు అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. కోట్లగేరిలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శాంతినగర్‌లో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు



గట్టులో అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వైభవంగా బ్రహ్మోత్సవాలు



అశ్వ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అయిజ: పట్టణ సమీపంలోని స్వయంభు కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయంలో బుధవారం నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో రాత్రి సమయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను అశ్వ వాహనంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, భోజన వసతి కల్పించారు.

ఉపాధి కూలీలకు పని కల్పించండి

అయిజ: ఈజీఎస్ ద్వారా కూలీలకు పని కల్పించాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. వర్షాలు లేక వ్యవసాయ కూలీలు ఖాళీగా ఉన్నారని, వారికి ఈజీఎస్ ద్వారా పని కల్పించాలని సూచించారు. వచ్చే యేడాది వర్షాకాలం నాటికి మొక్కలు పెంచేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహారెడ్డి, ఏపీఓ శరత్ బాబు పాల్గొన్నారు.

బీఎస్పీ మేనిఫెస్టోలో విద్యకు ప్రాధాన్యం

అలంపూర్: బీఎస్పీ మేనిఫెస్టోలో విద్యకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారని బీఎస్పీ జిల్లా కార్యదర్శి మహేష్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మేనిఫెస్టోను విడదల చేసినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో నిరుద్యోగ, విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిచినట్లు తెలిపారు. మేనిఫెస్టో దేశ తలరాతలను మార్చుతుందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి మేధావి, విద్యావేత్త సీఎం కావాలన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను ఖచ్చితంగా అమలు చేసి రాష్ట్రాన్ని ప్రగతి వైపు నడిపిస్తారన్నారు. అలాంటి వ్యక్తులను అలంపూర్ ప్రజలు ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు సురేష్, నాగరాజు, మద్దిలేటి, అనిల్, ముప్పారపు, శరత్, రవి ఉన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా కార్యదర్శి మహేష్

రాజ్యాధికారమే లక్ష్యం

అలంపూర్: బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా ధర్మసమాజ్ పార్టీ పని చేస్తోందని అలంపూర్ అసెంబ్లీ అభ్యర్థి లక్ష్మణ్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు తెలిపారు. 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం అందించడమే లక్ష్యంగా రాబోయే ఎన్నికల్లో పని చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్, వేమన్న, మహేష్ ఉన్నారు.

క్రమశిక్షణ గల పార్టీవైపే ప్రజలు

రాజోళి: క్రమశిక్షణ కలిగిన బీజేపీ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. బుధవారం తుమ్మలపల్లెలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదని, వాటి పాలనపై నమ్మకం లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాలను, వారి మధ్య జరిగిన రహస్య ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని, తమ ఓటు ద్వారా వారిని తరమికొడతారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాల పంపిణీ

రాజోళి: మేజర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న వారికి వేతనాలు అందజేసినట్లు కార్మికులు తెలిపారు. మూడు నెలలుగా వేతనాలు రావడంలేదని సీపీఎం నాయకుడు విజయ్‌కుమార్ 'సాక్షి' దృష్టికి తీసుకురాగా, 'కార్మికుల బాధలు పట్టవా' అనే శీర్షికతో బుధవారం వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నెలల జీతాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు, సీపీఎం నాయకులు 'సాక్షి' దినపత్రికకు, సర్పంచ్ వెంకటేశ్వరమ్మకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సత్తార్ మియ్య, లక్ష్మన్న, తిక్కన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



అలంపూర్‌లో ప్రచారం చేస్తున్న సంపత్ కుమార్

అలంపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ సంపత్ కుమార్ అన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీజోగుళాంబ అమ్మవారిని, బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆయన షా–అలీ–పహిల్వాన్ దర్గాలో మైనార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక దువా చేశారు. చివరగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాన రహదారిలో ర్యాలీగా బస్టాండ్ వరకు చేరుకున్నారు. మండలంలోని గొందిమల్ల, భైరన్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి..

ఉండవెల్లి మండలం బొంకూరుకు చెందిన బీజేపీ జిల్లా మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు శాంతి బీజేపీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లోకి లిఫ్ట్ కమిటీ చైర్మన్

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ లిఫ్ట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గొందిమల్లలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పెద్ద నాగశేషన్న, ఉప సర్పంచ్ నర్సింహ, వినోద్, వెంకటేష్, సర్దార్‌బాషా ఉన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు..



పార్టీలో చేరిన వారితో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షించి పార్టీలో చేరుతున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ధరూరు, కేటీదొడ్డి మండలాలకు చెందిన పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

గట్టు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, బీఆర్ఎస్ పార్టీకి మరోమారు అవకాశం కల్పించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి కృష్ణన్న కార్యక్రమంలో భాగంగా బుధవారం పెంచికలపాడు, తుమ్మలపల్లి, ముచ్చోనిపల్లె గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, ఎమ్మెల్యే కుమారుడు బండ్ల సాయిసాకేత్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

ధరూర్: కేసీఆర్ ప్రవేశపెట్టిన బీమాతో ఇంటింటా ధీమా వ్యక్తమవుతోందని మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అన్నారు. మండలంలోని పారుచర్ల, చిన్నపాడు, పెద్దపాడు గ్రామాల్లో బీఆర్ఎస్ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గ్రామాల్లో పదివేల మొక్కలు పెంచాలి

శాంతినగర్: 2023–24 ఏడాదికి ప్రతి గ్రామ పంచాయతీలో పదివేల మొక్కలు పెంచాలని ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ రవీంద్ర ఆదేశించారు. వడ్డేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో నాటిన మొక్కలను సంరక్షించాలని, కొత్త మొక్కల పెంపకానికి ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. అవసరమైన గ్రామ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేసి పదివేల మొక్కల టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఎర్రమట్టి, విత్తనాలు సేకరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీఓ విజయలలిత, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

బతుకమ్మ సంబరాలు

అలంపూర్: మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను తలపై పెట్టుకొని పట్టణ పురవీధుల్లో ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జోగుళాంబ ఆలయం సమీపంలోని పుష్కరఘాట్ వద్ద నదిలో నిమజ్జనం చేశారు.

ధరూరు: మండల కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు కళాశాల నుంచి బతుకమ్మలతో వైఎస్సార్ చౌరస్తాకు చేరుకున్నారు. చౌరస్తాలో బతుకమ్మ పాటలకు బొడ్డెమ్మలు వేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రమేష్‌లింగం మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, గోవర్ధన్‌శెట్టి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రపంచంలో పూలతో జరుపుకునే పండుగ మనదేశంలో తెలంగాణలో ఉందన్నారు. విద్యార్థులు కోలాటలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మనరావు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, మహేందర్‌గౌడ్, బాలకృష్ణ, బ్రహ్మయ్య, ప్రశాంతి, శ్రీనివాసులు, నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని హరిహర జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ పండుగ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ వేషాధారణలతో విద్యార్థులు బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని ఆడు తూ, పాడుతూ బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. బతుకమ్మ పాటలతో కళాశాల ప్రాంగణం మారుమోగింది.

గట్టు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థినులు పూలతో బతుకమ్మలను తయారు చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కేఎస్‌డీ రాజు, లెక్చరర్లు రాజగోపాల్, శ్యాంసుందర్, మహేష్, రాధిక, రంగస్వామి, శ్రీజ, భరత్‌కుమార్, అంజి, శేఖర్, విష్ణు, గోపాల్, మోహన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

గొర్లఖాన్‌దొడ్డిలో..

గొర్లఖాన్‌దొడ్డిలో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు జమున, అరుణ, గోవిందమ్మ, సుజాత, ఇందు, సరోజ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో బతుకమ్మ సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థినులు



అలంపూర్‌లో బతుకమ్మ ఆడుతూ..



ధరూరులో జూనియర్ కళాశాల విద్యార్థినులు



మల్దకల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



అయిజలో..